కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఎల్‌బీనగర్: రోడ్డు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కార్యవర్గం సభ్యులు కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులతో ఇటీవల క్రాంతి హిల్స్ కాలనీ నుంచి విల్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టారన్నారు. అయితే.. కొందరు స్థానికులను భయాందోళనకు గురిచేసి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడంతో ఒక కాలనీ నుంచి మరో కాలనీకి వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫెన్సింగ్‌ను తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఆలేటి ఎల్లయ్య, సీహెచ్ వెంకన్న, ఎం.వీరయ్య ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



స్వప్నకు బాధ్యతలు అప్పగిస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి

మలక్‌పేట: గంగోత్రి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా వల్లెం స్వప్న బాధ్యతలు చేపట్టారు. సోమవారం జరిగిన 12 వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి 320–ఏ జిల్లా గవర్నర్ (వీడీజీ1) డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డి హాజరై క్లబ్ అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి ఏ.నరేష్, కోశాధికారి జి. ప్రశాంత్‌తో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో లయన్స్ క్లబ్ సేవలు విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల మన్ననలు పొందాలన్నారు. వల్లెం భరత్‌రాజ్ రెడ్డి, చెక్కిలా ఆనంద్, యాదయ్యగౌడ్, దామోదర్, సతీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బొమ్మలగుడి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు రెండవ రోజూ సాగింది. సోమవారం బొమ్మల గుడి నుంచి స్వాతి రెసిడెన్సీ రోడ్డుకు ఇరువైపులా తొలగించాగా, మంగళవారం వినాయక్‌నగర్ చౌరస్తా వరకున్న ఆక్రమణలను తొలగించారు. హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావనీ రోడ్డు ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి మన్సూర్, సిబ్బంది మహేందర్, పాషా, సాయి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిఘా

- పిల్లలను పనిలో పెట్టుకున్న పలువురిపై కేసు

చంచల్‌గూడ: బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు అటు ప్రభుత్వం ఇటు స్వచ్ఛంద సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయి. వ్యాపార సంస్థలు చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకుంటే ఊచలు లెక్కించాల్సిందే. వ్యాపార సముదాయాలు, మార్కెట్ ప్రాంతాలపై సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక నిఘా పెట్టాయి. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించగా నలుగురు బాల కార్మికులను గుర్తించారు. చట్ట విరుద్ధంగా పిల్లలను పనిలో పెట్టుకున్న పెట్టుకున్న నలుగురు యజమానులపై కేసు నమోదు చేశారు.

అ 'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చంపాపేట: చంపాపేట డివిజన్ రెడ్డి కాలనీలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాలలో 1999లో పది పూర్తి చేసిన 60 మంది విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను క్షేమ సమాచారం తెలుసుకుని పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. కుటుంబ సభ్యులతో హాజరైన పూర్వ విద్యార్థులు తమ ప్రస్తుత వివరాలను వేదికపై పంచుకున్నారు. విద్యార్థుల ఉన్నత స్థితిని చూసిన నాటి ఉపాధ్యాయులు మురిసిపోయారు. 25 ఏళ్ల నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్ సురేందర్‌రెడ్డి పూర్వ విద్యార్థులు కిషన్‌గౌడ్, జగదీష్, ప్రవీణ్, శరత్, జ్యోతి, అలివేలు, మాలతి, మల్లారెడ్డి, రహమాన్, సతీష్, శ్రీనివాస్, నాటి ఉపాధ్యాయులు కౌసల్య, విశ్వరూపం, సుధాకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని రోడ్లు, శానిటేషన్, ట్రాఫిక్, వీధి దీపాలు తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

నిధుల మంజూరుకు..

నాగోలు: బోనాల ఉత్సవాలు సందర్భంగా దేవాలయ వద్ద బోనాల ఏర్పాట్లకు నిధులు విడుదల చేయాలని, అమ్మవారికి బోనాలు సమర్పించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణలో పెద్ద పండుగా అయిన డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల వద్ద బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.



రోడ్డు ఇలా.. అడుగు వేసేదెలా?

- గుంతలమయంగా నాగోలు–బండ్లగూడ రహదారి
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదాలకు నిలయంగా ఆనంద్‌నగర్–బండ్లగూడ రోడ్డు

నాగోలు: నాగోలు చౌరస్తా నుంచి బండ్లగూడ, ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి ఓఆర్‌ఆర్‌కు వెళ్లే రహదారి అంతా గోతులమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బండ్లగూడ చౌరస్తా నుంచి ఆనంద్‌నగర్ మధురానగర్ వరకు రోడ్డు ఎక్కడ చూసిన అడుగడుగునా గోతులు, మట్టి దిబ్బలతో ఎగుడుదిగుడుగా మారడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. నాగోలు గ్రామం, అనంతుల రాంరెడ్డిగార్డెన్, బండ్లగూడ చౌరస్తా, ఆనంద్‌నగర్ చౌరస్తాలో మార్గంలో రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సిందే. గతంలో ఈ మార్గాల్లో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆయా రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరి గుంతెదో.. రోడ్డేదో తెలియక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారుల్లో రాకపోకలు సాగించే కార్లు సైతం షెడ్‌లకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకున్నా స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.

విద్యార్థిని వినూత్న నిరసన..



గతంలో జీవీఆర్ కాలనీ చెందిన నిహారిక పాఠశాలకు వెళ్తుండగా గుంతలమయంగా మారిన రోడ్డులో అదుపు తప్పి కింద పడింది. రోడ్డు సరిగా లేదని గతంలో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి సోషల్ మీడియా ట్వీట్ చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. కానీ.. జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అక్కడ పెను ప్రమాదాలు జరగక ముందే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులు, మేయర్‌కు చేసిన విజ్ఞప్తులను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తాలో మే నెలలో నిహారిక బురద గుంతలో కూర్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపింది. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి పార్లమెంట్ ఎన్నికల కోడ్ పూర్తవ్వగానే రోడ్డు పనులు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డుకు తాత్కాలిక మట్టి పోసి మరమ్మతులు చేశారు. కొన్ని రోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నాగోలు–బండ్లగూడ మార్గంలో నూతన రోడ్డు నిర్మాణం చేపడితేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫుట్‌పాత్ పనులపై సమీక్ష

అధికారుల హామీతో పునఃప్రారంభం



ఫుట్‌పాత్ పనులపై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం: వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ నుంచి ఎన్జీవోస్ కాలనీ వైపు నిర్మిస్తున్న ఫుట్‌పాత్ పనులను మంగళవారం జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోన్ ఈఈ రమేష్‌కుమార్, డీఈ దామోదర్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ ఫుట్‌పాత్‌ల నిర్మాణంపై కార్పొరేటర్ స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేసి, పనులను నిలిపివేసిన నేపథ్యంలో మంగళవారం పనులపై సమీక్షించారు. ఫుట్‌పాత్ నిర్మాణంతో రోడ్డు కుంచించుకుపోతుందని, ఆయా షాపులకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతాయని కార్పొరేటర్, స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు అభివృద్ధిలో భాగంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టామని, స్థానికుల ఫిర్యాదు మేరకు ఫుట్‌పాత్ వెడల్పు తగ్గించి, కొంత మేరా వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పనులకు సానుకూలత తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకల పంపిణీ



నోట్‌బుక్స్, పలకలు అందజేస్తున్న సభ్యులు

మన్సూరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్‌నగర్ సెంటీనియల్ కమిటీ సభ్యులు మంగళవారం మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్ పలకలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ..స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి పేద విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేయడం అభినందనీయమన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు త్రిలోక్‌నాథ్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లారెడ్డి, బాలస్వామి, మాణిక్‌రెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు సరిత, నాయకులు నాంపల్లి శంకరయ్య, జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, నవీన్‌గుప్తా పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య, టైలరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: ఓయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో వృత్తి నైపుణ్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, టాలీ ప్రైమ్, డీటీపీ, సీలాంగ్వేజ్, పైథాన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ లిటరసీ హౌజ్ కార్యదర్శి బి. నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఆర్టిఫీషియల్ ఫ్లవర్ మేకింగ్, బ్యూటీషియన్ కోర్సు, బ్రైడల్ మేకప్, మెహిందీ డిజైనింగ్, హెయిర్ స్టైల్, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. అలాగే సీనియర్ సిటిజన్స్‌కు స్పెషల్ డిజైన్డ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆగస్టు 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఫోన్ నం.99512 10441/97010 98541లో సంప్రదించగలరు.

ఓయూ అమ్మవారి ఆలయానికి భక్తులకు అనుమతి ఇవ్వాలి

అంబర్‌పేట: బోనాల ఉత్సవాల కోసం ఉస్మానియా యూనివర్సిటీ మోయిన్ చెరువు కట్టపై ఉన్న అమ్మవారి ఆలయానికి భక్తులకు అనుమతి ఇవ్వాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి ఓయూ భద్రత అధికారి రాహుల్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈనెల 28న బోనాల నేపథ్యంలో చెరువు కట్టమీద ఉన్న అమ్మవారి ఆలయం వద్ద బోనాల వేడుకలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలన్నారు. నాయకులు బి.వెంకట్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం .. ట్రై సైకిళ్లు నిరుపయోగం



వికలాంగుల సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులతో తయారు చేయించిన ట్రై సైకిళ్లను జిల్లాలకు పంపిణీ చేయకుండా మలక్‌పేట ప్రధాన కార్యాలయంలో మూలన పడేశారు. ట్రై సైకిళ్లు కావాలని ఓ పక్క దివ్యాంగులు తిరుగుతుంటే ప్రధాన కార్యాలయంలో పెట్టుకుని పంపిణీ చేయకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రై సైకిళ్లను జిల్లాలకు తరలించి అవసరమున్న వారికి అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. –చాదర్‌ఘాట్

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల ఇలా.. టమోటా రూ.45, వంకాయ రూ.28, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.25, క్యారెట్ రూ.42, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.40, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడు రూ.65, అర్వి రూ.37, మునగ రూ.75, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.21, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.53. ఈ బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే వర్తిస్తాయి.

ఘనంగా ఎల్లమ్మదేవి కల్యాణం

మన్సూరాబాద్: హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రేణుకా ఎల్లమ్మదేవి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి నాగరాజు, పారంద నవనీత, నర్సింగ్‌రావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం

నాగోలు: ఎమార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల ముఖ్యకార్యకర్తల సమావేశం మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్ఎఫ్) సీనియర్ నాయకులు బత్తిన సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని కమర్షియల్ టాక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ సమావేశం ఉంటుందన్నారు.

బోనాలకు ఆహ్వానం

సైదాబాద్: పాతబస్తీలో అత్యంత ఘనంగా నిర్వహించే శ్రద్ధాబాద్ మహంకాళి బోనాల వేడుకలకు రావాలని ఉత్సవ కమిటీ చైర్మన్ సుభాష్‌చందర్జీ, ఉపాధ్యక్షుడు సంగోధి పరమేష్ కుమార్ మంగళవారం బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

బోనాల కమిటీ ఛైర్మన్‌గా సుధీర్

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేట బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా తంగెళ్ల సుధీర్, వైస్ చైర్మన్లుగా నింబోలి బాబురావు, ప్రేమ్‌కుమార్, జనపాల మధు, కోశాధికారిగా గుంటి ధరమ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మాదన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీర్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది తరహా ఈ సారి కూడా బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీని ఆహ్వానిస్తామన్నారు.

జలమండలి డీజీఎంగా అభిలాష్



చాదర్‌ఘాట్: మలక్‌పేట సబ్ డివిజన్ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఎన్.అభిలాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శీలారాణి బంజారాహిల్స్ డివిజన్ జలమండలి ప్రాజెక్ట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీజీఎం అభిలాష్ మాట్లాడుతూ..తాగునీటి, డ్రైనేజీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మలక్‌పేట: ఉరేసుకున ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అమలాపురం మండలం, చింతలంకకు చెందిన గణేష్(45), లక్ష్మి భార్యాభర్తలు. జీవనోపాధి కోసం నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గణేష్ మరో మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరిగేవి. కుటుంబాన్ని పట్టించుకోకుండా కొన్ని రోజులుగా అతడు ఆ మహిళతోనే ఉంటున్నాడు. లక్ష్మి ఆదివారం గడ్డిఅన్నారంలో నివాసముంటున్న మహిళ ఇంటి వద్దకు వచ్చి భర్తతో గొడవ పడింది. ఆ తర్వాత గణేష్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టండి



కలుషిత నీటితో నిరసన తెలుపుతున్న స్థానికులు

సైదాబాద్: నిరుపేదలు నివసించే సింగరేణి కాలనీలో మౌలిక వసతులు కల్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధుల చిన్నచూపు సరికాదని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. సింగరేణి కాలనీలో కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆయన గుడిసెవాసులతో కలిసి కలుషిత నీటి బాటిళ్లతో వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు ఎస్సీలు ఎస్టీలు మైనారిటీలు ఎక్కువగా నివసించే సింగరేణి వాంబే కాలనీలో ఏళ్ల తరబడి డ్రైనేజీ, తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయన్నారు. డ్రైనేజీలు ధ్వంసమై వాటి నుంచి వచ్చే మురుగునీరు తాగునీటి పైప్‌లైన్లలో కలుస్తుండటంతో కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. తప్పని పరిస్థితుల్లో అదే నీటిని తాగి అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని కోరుతున్నారు. నిరసనలో బస్తీవాసులు రమేష్, శ్రీను, హుస్సేన్, రఫీ, హైమద్, లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో చేపడుతున్న నూతన సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈ మాత్రునాయక్‌తో కలిసి పరిశీలించారు. కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట రాజేష్, భరత్ రెడ్డి, చంద్రకాంత్ ఉన్నారు.

- అనంతరం శివగంగా కాలనీలో సీజనల్ వ్యాధుల పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దోమలు వ్యాప్తి చెందకుండా సంపులు, కూలర్లు, డ్రమ్ములు, పూల కుండీల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తాచెదారం బహిరంగ ప్రదేశాలలో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామ్ బాబు, వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిగౌడ్, సుబ్బారావు, వెంకట్ రాయుడు, శ్రీనివాస్ గౌడ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



బ్యాగులు అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

నాగోలు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమంగా రాణించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శైలేందర్, సర్వీస్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవికుమార్ అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఫార్మేషన్ డే సందర్భంగా సర్వీస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం బ్యాగులు, మైకోసెట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మోహన్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు చేయూతను అందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వీస్ బ్రాంచ్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. కట్టా ఆంజనేయులు, సీనియర్ మేనేజర్ ఎ. ఆనంద్ కుమార్, మేనేజర్ వి. రామారావు, అమూల్య, యోగా టీచర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు శోభారాణి, సునీతా, అరుణాజ్యోతి పాల్గొన్నారు.

తొలగించారు సరే.. తరలించేదెవరో?

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను తొలగించిన సిబ్బంది వాటిని తరలించకుండా వదిలేస్తున్నారు. రోడ్లపై ఉన్న చెట్ల కొమ్మలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీలవాసులు, వాహనదారులు వాపోతున్నారు. చెట్ల కొమ్మల తరలింపు తమదంటే తమ బాధ్యత కాదంటూ విద్యుత్, జీహెచ్‌ఎంసీకి అధికారులు ఒకరిపై ఒకరి చెబుతూ కాలాయాపన చేస్తున్నారని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –ఎల్‌బీనగర్



చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

లింగోజిగూడ: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం మధురవాడకు చెందిన షేక్ అజీజ్, ఈస్ట్ గోదావరి అమలాపురం కొంకపల్లికి చెందిన పతివాడ లోవరాజు ఇద్దరు సొంతూళ్ల నుంచి నగరానికి వచ్చి రాత్రి సమయంలో తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లి సొంతూళ్లలో విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తుంటారు. అదే విధంగా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునగనూర్‌లో రెండు, గత నెల 27న ప్రియదర్శిని కాలనీలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలు, వివిధ కోణాలలో దర్యాప్తు ప్రారంభించారు. చోరీలకు పాల్పడేవారు పాత నేరస్తులుగా నిర్ధారించి నిఘా పెట్టారు. మంగళవారం పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద హయత్‌నగర్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా అజీజ్ కారు(ఏపీ39ఎంజెడ్3876)లో అనుమానాస్పందంగా సంచరిస్తుండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటి వరకు 12 కేసులు నమోదై ఉన్నాయి. మరో నిందితుడు పతివాడ లోవరాజు పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ వెంకటేశ్వర్‌రెడ్డి కన్నుమూత



ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి (ఫైల్)

వనస్థలిపురం: సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి అనారోగ్య సమస్యలతో మంగళవారం కర్నూల్ జిల్లా నంద్యాలలో మృతిచెందారు. కుమార్తె వనస్థలిపురంలో నివాసం ఉంటుండడంతో ఆయన మృతదేహాన్ని ఇక్కడికి తరలించి సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటేశ్వర్‌రెడ్డి గతంలో హైదరాబాద్‌లో విజేత దినపత్రికకు మేనేజర్, అనంతరం ఎల్‌బీనగర్ వనస్థలిపురం పరిధిలో ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో విలేకరిగా పనిచేశారు. తదనంతరం మంతెన సత్యనారాయణ ఆశ్రమంలో ఆరోగ్య పరిరక్షణ అంశాలపై రిపోర్టర్‌గా పని చేశారు. ఆయన మృతి పట్ల పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంతాపం ప్రకటించారు.